తల్లీబిడ్డలకు ప్రాణం పోసిన 108

- ప్లాట్‌ఫాంపైనే పురుడుపోసిన సిబ్బంది
- సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌లో ఘటన



సికింద్రాబాద్‌: ప్లాట్‌ఫాంపైనే బాధపడుతున్న ఓ గర్భిణికి 108 సిబ్బంది పురుడు పోసి తల్లీ బిడ్డలను కాపాడారు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన అనూష (22) ఒంటరిగా ఉంటోంది. బుధవారం రైలులో సికింద్రాబాద్‌ రైల్వే స్టేషనుకు వచ్చింది. అప్పటినుంచీ 6వ నెంబర్‌ ప్లాట్‌ఫాంపైనే ఉంటోంది. తెల్లవారుజాము సమయంలో ఆమె పురుటినొప్పులతో బాధపడుతోంది. ఈ విషయాన్ని గమనించిన ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఎమర్జెన్సీ మెడికల్‌ టెక్నీషియన్‌ వివేక్‌వర్ధన్‌, పైలెట్‌ లక్ష్మణ్‌ అత్యవసర వైద్య సేవలు అందించడంతో సాధారణ ప్రసవం అయింది. తల్లితోపాటు అప్పుడే పురుడు పోసుకున్న ఆడశిశువును జీఆర్‌పీ పోలీసుల సహకారంతో చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లీకూతుళ్లు క్షేమంగా ఉన్నట్టు శుక్రవారం గాంధీ వైద్యులు తెలిపారు. ఫోన్‌కాల్‌ సమాచారంతో 10 నిమిషాల్లో రైల్వేస్టేషన్‌కు చేరుకుని అత్యవసర ప్రసూతి సేవలు అందించిన 108 సిబ్బందిని ప్రయాణికులు అభినందించారు.

లావణ్యకు ఓయూ డాక్టరేట్‌



లాలాపేట: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్‌గా పని చేస్తున్న పెంటమల్ల లావణ్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను పొందారు. డాక్టర్‌ ఆర్‌కే పవన్‌కుమార్‌ పర్యవేక్షణలో 'ప్రింట్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ మీడియా లైబ్రరీ సర్వీసెస్‌ ఫర్‌ జర్నలిస్ట్‌ ఇన్‌ హైదరాబాద్‌' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ లావణ్యకు డాక్టరేట్‌ను ప్రకటించింది.

ప్రధానోపాధ్యాయురాలికి పదవీ విరమణ వీడ్కోలు



పుష్పాంజలిని సత్కరిస్తున్న హెచ్‌ఎం ఆశీర్వాదం తదితరులు

రసూల్‌పురా: విజ్ఞాన సంపద కలిగి ప్రత్యేక నైపుణ్యాలను విద్యార్థులకు నేర్పించి వారు ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు ప్రోత్సహించిన ఉపాధ్యాయులు కలకాలం చిర స్థాయిగా నిలిచి పోతారని బాపూజీనగర్‌ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడ ఆశీర్వాదం అన్నారు. తిరుమలగిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి. పుష్పాంజలి పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం గురువారం రాత్రి తిరుమలగిరిలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆశీర్వాదం మాట్లాడుతూ.. పుష్పాంజలి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులు విద్యార్థులపై అత్యున్నత స్థాయి ప్రభావాన్ని కలిగి ఉంటారని పదవీ విరమణ చేసిన పుష్పాంజలి అన్నారు.

అంబేడ్కర్‌, బాబూజగ్జీవన్‌రామ్‌ విగ్రహాలకు పాలాభిషేకం

సనత్‌నగర్‌: భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ తీర్పు వెలువరించడం పట్ల ఎస్‌సీఆర్‌పీఎస్‌ నేతలు శుక్రవారం బేగంపేట వై జంక్షన్‌ వద్ద ఉన్న అంబేద్కర్‌, బాబూజగ్జీవన్‌రామ్‌ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. ఏఐఎస్‌సీఆర్‌పీఎస్‌ జాతీయ అధ్యక్షులు రాగాల నాగేశ్వరరావు, ఎస్‌సీఆర్‌పీఎస్‌ తెలంగాణ అధ్యక్షులు సుదర్శన్‌బాబు, నగర ఉపాధ్యక్షుడు కుర్మ మహేందర్‌లతో పాటు రాపాక అశోక్‌ పాల్గొన్నారు.

ఓయూలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీ నిరుద్యోగులను నమ్మించి మోసగించారని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద ధర్నా చేసి రాహుల్‌ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏటా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి జాబ్‌ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్యను చూపకపోవడం దారుణమన్నారు. పోలీసులు విద్యార్థి నాయకులను అడ్డుకొని అరెస్ట్‌ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తుంగ బాలు, చటారి దశరథ్‌, నగేష్‌, మిథున్‌ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో పునర్జన్మ



అవయవ దాతల కుటుంబాలను సత్కరిస్తున్న డీఎంఈ వాణి

గాంధీఆస్పత్రి: బ్రెయిన్‌ డెడ్‌ అయిన వ్యక్తుల అవయవాలను దానం చేయడం ద్వారా మరికొందరికి పునర్జన్మ ఇవ్వొచ్చని జీవన్‌దాన్‌ చైర్‌ పర్సన్‌ డీఎంఈ డాక్టర్‌ ఎస్‌.వాణి అన్నారు. శుక్రవారం గాంధీ మెడికల్‌ కాలేజీలో జీవన్‌ దాన్‌ ఆధ్వర్యంలో నేషనల్‌ ఆర్గాన్స్‌ డోనర్స్‌ డేను నిర్వహించారు. నిమ్స్‌, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో జీవన్‌ దాన్‌ ట్రస్ట్‌ ద్వారా 2022 జూలై నుంచి 2023 మార్చి వరకు బ్రెయిన్‌ డెడ్‌ అయిన వ్యక్తుల ఆర్గాన్స్‌ డొనేట్‌ చేసిన 143 మంది దాతల కుటుంబ సభ్యులను సత్కరించి, ప్రశంస పత్రాలను అందజేశారు. బ్రెయిన్‌ డెడ్‌ అయిన వ్యక్తుల అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన వారి కుటుంబ సభ్యుల సేవా భావం, సామాజిక బాధ్యత ఎంతో అభినందనీయమని కొనియాడారు.

ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు

రోడ్డు విస్తరణలో భాగంగా ఫుట్‌పాత్‌లు కనుమరుగు అవుతుంటాయి. కానీ సికింద్రాబాద్‌ సంగీత్‌ చౌరస్తాలో మాత్రం పరిస్థితి రివాజుకు విరుద్ధంగా మారింది. ఇక్కడ కొద్ది నెలల క్రితం నిర్మించిన ఫుట్‌పాత్‌ ఏకంగా ప్రధాన రహదారిని కమ్మేసింది. సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ పరిసర ప్రాంతాల రహదారుల్లో ఫుట్‌పాత్‌లు పూర్తిగా కనుమరుగయ్యాయి. రహదారుల విస్తరణల్లో కొన్ని, వ్యాపారుల ఆక్రమణల్లో మరికొన్ని మొత్తంగా ఈ ప్రాంత ఫుట్‌పాత్‌ల అడ్రస్‌లు గల్లంతయ్యాయి. అటువంటి ప్రాంతాల్లో పాదచారుల సంఖ్య వేల సంఖ్యలో ఉంటున్నా ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు చేపట్టడం లేదు. ఉన్న ఫుట్‌పాత్‌లను పరిరక్షించడం లేదు. వందలాది వాహనాల గజిబిజిని దాటుకుని నడవాల్సిన ప్రమాదకర పరిస్థితులు రైల్వేస్టేషన్‌ ప్రాంతంలో పాదచారులకు ఎదురువుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా సంగీత్‌ చౌరస్తాలో మాత్రం పాదచారుల సంచారం లేకున్నా అవసరానికి మించిన భారీ ఫుట్‌పాత్‌ను నిర్మించిన జీహెచ్‌ఎంసీ అధికారులు వాహనదారులకు కొత్త సమస్యలు తెచ్చిపెడుతున్నారు. కొత్తగా నిర్మించిన భారీ ఫుట్‌పాత్‌ రహదారిని మింగేయడంతో రాకపోకలకు తీవ్రంగా అవాంతరాలు కలుగుతున్నాయి.

-సికింద్రాబాద్‌



పాదచారుల సందడి లేకపోయినా అవసరానికి మించి నిర్మించిన ఫుట్‌పాత్‌

రహదారిని కమ్మేసిన ఫుట్‌పాత్‌

- నిరుపయోగంగా ఫ్రీ లెఫ్ట్‌ మార్గం
- బారులు తీరుతున్న వాహనాలు
- ప్రతినిత్యం ట్రాఫిక్‌ జామ్‌
- సంగీత్‌ కూడలిలో నిత్య నరకం

సికింద్రాబాద్‌ ప్రాంతంలోని సంగీత్‌ కూడలి అత్యంత వాహనాల రద్దీ కలిగిన ప్రాంతం. మెట్రో కారిడార్లు వచ్చి రహదారుల విస్తరణ చేసే వరకు ఈ కూడలిలో వాహనాలు ఆసాంతం బారులు తీరి కనిపించేవి. ముఖ్యంగా వివిధ ప్రాంతాల నుంచి ఎస్‌పీ రోడ్డు మీదుగా మెట్టుగూడ, తార్నాక, లాలాగూడ, హబ్సిగూడ ప్రాంతాలకు వెళ్లే వాహనాలన్నీ సంగీత్‌ చౌరస్తా రైల్‌నిలయం మీదుగా వెళుతుంటాయి. మెట్రో కారిడార్ల నిర్మాణం అనంతరం ఈ రహదారులను ఆసాంతం విస్తరించారు. విస్తరణ తరువాత ఈ కూడలిలో వాహనాల రద్దీ సమస్యలు కొంతమేర తగ్గాయి. ట్రాఫిక్‌ సమస్యలు తగ్గడంతో వాహనాదులకు కొంతమేర ఉపశమనం కలిగింది.

ఫుట్‌పాత్‌ నిర్మాణంతో....

ఎస్‌పీరోడ్డు మీదుగా సంగీత్‌కూడలి నుంచి రైల్‌నిలయం (ఎడమవైపు) వెళ్లే దారిలో వాహనాలు గతంలో సాఫీగా వెళ్లిపోయేవి. ప్రత్యేకంగా ఈ మార్గంలో ఫ్రీ లెఫ్ట్‌ ను ఏర్పాటు చేయడంతో వాహనదారుల పరిస్థితి మరింత ప్రశాంతంగా మారింది. ఎంత ట్రాఫిక్‌ ఉన్నప్పటికీ ఈ కూడలి గుండా వాహనాలు సజావుగా రైల్‌నిలయం వైపు వెళ్లేవి. కొద్ది నెలల క్రితం ఈ కూడలిలో అవసరానికి మించి విశాలమైన ఫుట్‌పాత్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్మించారు. దీంతో విశాలమైన రహదారి కాస్త ఇరుకుగా మారింది. సంగీత్‌ కూడలి నుంచి రైల్వేస్టేషన్‌ వెళ్లే మార్గంలో రెడ్‌లైట్‌ సిగ్నల్‌ పడినపుడల్లా రైల్‌నిలయం వైపు వెళ్లే వాహనాలు కూడా నిలిచిపోవాల్సి వస్తుంది. సికింద్రాబాద్‌ వైపు వెళ్లే మార్గంలో గ్రీన్‌ సిగ్నల్‌ ఉన్నపుడు మాత్రమే రైల్‌నిలయం వైపు కూడా వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

వాహనాల బారులు

ప్రతినిత్యం ఉదయం సాయంత్రం వేళల్లో రైల్‌నిలయం వైపు వెళ్లే వాహనదారులు సంగీత్‌కూడలి వద్ద ట్రాఫిక్‌ సమస్యలు ఎదుర్కుంటున్నారు. ఒక వైపు ఫ్రీ లెఫ్ట్‌ మార్గం ఉన్నప్పటికీ ఫుట్‌పాత్‌ విశాలంగా నిర్మించిన కారణంతో వాహనాలు బారులు తీరక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఫలితంగా సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ వైపు వెళ్లే వాహనదారులు కూడా ఇబ్బంది కరంగానే సిగ్నల్‌ దాటాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. పాదచారుల జాడ అంతంత మాత్రంగానే ఉన్న సంగీత్‌ చౌరస్తాలో అవసరానికి మించిన భారీ ఫుట్‌పాత్‌ నిర్మించడం, ఫుట్‌పాత్‌పై ఆసీనులు అయ్యేందుకు కుర్చీలు ఏర్పాటు చేయడం పట్ల ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అవసరమైన మేరకు మాత్రమే ఫుట్‌పాత్‌ను పరిమితం చేసి రహదారిని విస్తరించి తమకు మార్గం సుగమంఏయాలని వాహనదారులు కోరుతున్నారు.

మేడిబావి బోనాలకు భారీ ఏర్పాట్లు

- సర్వాంగ సుందరంగా ఆలయం
- 4,5 తేదీల్లో ఎల్లమ్మ బోనాల వేడుకలు



మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు బోనాల ఆహ్వానాన్ని అందిస్తున్న ఆలయ ఛైర్మన్‌

సికింద్రాబాద్‌: సీతాఫల్‌మండి డివిజన్‌ మేడిబావిలో అత్యంత ప్రాచీనమైన శ్రీఎల్లమ్మ ముత్యాలమ్మ ఆలయంలో ఆలయంలో బోనాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 4, 5 తేదీల్లో ఆలయంలో ఘనంగా బోనాల వేడుకలు జరుగనున్నాయి. రావి, వేప చెట్ల నీడన కొలువుదీరిన మేడిబావి అమ్మవార్లకు సమీపంలో నెలకొని ఉన్న బావి నీళ్లను ఒంటిపై జల్లుకోవడం ద్వారా రోగాలు దరిచేరవన్నది ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ముత్యాలమ్మ, ఎల్లమ్మ దేవాలయ బాధ్యతలను స్వీకరించిన స్థానిక పారిశ్రామికవేత్త పరికిబండ కళాప్రకాశ్‌ ఆలయాన్ని నిర్మించడంతోపాటు 25 ఏళ్లుగా ఘనంగా ఏటా బోనాల జాతర వేడుకలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు అత్యంత ఘనంగా నిర్వహించనున్న ముత్యాలమ్మ, ఎల్లమ్మ బోనాల వేడుకలకు సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం రానున్నట్టు అంచనా వేస్తున్నారు. మాజీ మంత్రులు తీగుళ్ల పద్మారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ తదితరులు వేడుకలకు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్టు ఆలయ చైర్మన్‌ పరికిబండ కళాప్రకాశ్‌ తెలిపారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు, ఫలహారం బండ్ల ఊరేగింపుల స్వాగత వేదికలు ఏర్పాటు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రశాంతంగా బోనాల వేడుకలు పూర్తి చేసేందుకు చిలకలగూడ పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

గాంధీ ఆసుపత్రిలో ఘనంగా బోనాల వేడుకలు



గాంధీ ఆసుపత్రి బోనాల వేడుకలకు హాజరైన సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రాజకుమారి

గాంధీఆసుపత్రి: గాంధీ ఆసుపత్రి టీఎన్‌జీఓ యూనియన్‌ ఆధ్వర్యంలో బంగారం మైసమ్మ సన్నిధిలో శుక్రవారం ఘనంగా బోనాల జాతర నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలతో డప్పు చప్పుళ్ల మధ్య మహిళా ఉద్యోగులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. సూపరింటెండెంట్‌ డా.రాజకుమారి, ఆర్‌ఎంఓ-1 డా.శేషాద్రి, టీఎన్‌జీఓ రాష్ట్ర నాయకులు జగదీష్‌, ముజీబ్‌ ప్రత్యేక పూజలు చేశారు. ఏడీ ఫ్లోరెన్స్‌ మెర్లిన్‌, ఓఎస్‌ రామయ్య, విక్రం, ప్రభాకర్‌, ప్రసన్న, శ్రవణ్‌ భావన విశ్వనాథ్‌ పాల్గొన్నారు.

అర్ధరాత్రి బెదిరించి దోపిడీ

అమీర్‌పేట: తప్పుడు కేసులు పెట్టించి జైలుకు పంపుతామని బెదిరించి డబ్బులు దండుకున్న అగంతకులపై ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన ఎల్‌.పవన్‌ పంజగుట్టలో గల పీవీఆర్‌ సినిమాలో పనిచేస్తూ ఎస్‌ఆర్‌నగర్‌లోని విష్ణు బాయ్స్‌ హాస్టల్‌లో ఉంటున్నాడు. పవన్‌ ఇదే హాస్టల్‌లో ఉండే నలుగురు స్నేహితులైన రాజేష్‌,రాకేష్‌,భరత్‌, వంశీలతో కలిసి గురువారం రాత్రి సినిమాకు వెళ్లారు.అర్ధరాత్రి సమయంలో నడుచుకుంటూ తిరిగి హాస్టల్‌కు వస్తుండగా ఈస్ట్‌ శ్రీనివాస్‌నగర్‌ కాలనీలోకి రాగానే నలుగురు అగంతకులు అడ్డుకుని కొట్టి భయ భ్రాంతులకు గురి చేశారు. డబ్బులు ఇవ్వాలని లేదంటే గంజాయి విక్రయిస్తూ, కత్తులు పెట్టుకుని తిరిగుతున్నట్లు పోలీసు కేసులు పెట్టిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో పవన్‌ రూ 1000 నగదు ఇవ్వగా మరో వ్యక్తి రూ.2000 ఫోన్‌ పై చేసి వెళ్లబోయారు. తిరిగి వారిని వెంబడించి ఒక కత్తి బలవంతగా వారి ముందుంచి వీడియో తీశారు.మరో సారి డబ్బులు డిమాండ్‌ చేయడంతో రూ.7000 ఇచ్చారు. అనంతరం ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

టైపిస్టుల అసోసియేషన్‌ నేతల హర్షం



ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్‌ నాయకులు

లాలాపేట: తెలంగాణలోని టైప్‌రైటింగ్‌ సెంటర్లు, నిరుద్యోగులైన టైపిస్టుల సమస్యలను ప్రభుత్వానికి తెలిసేలా శాసన మండలి వేదిక ద్వారా ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌ ప్రస్తావించడంపై తెలంగాణ టైపురైటింగ్‌ షార్ట్‌ హ్యాండ్‌ కంప్యూటర్‌ ఇన్స్టిట్యూట్స్‌ అసోసియేషన్‌ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్‌ నాయకులు పలువురు ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్సీని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టైపిస్టు ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలనీ ఈ సందర్భంగా నిరుద్యోగ విద్యార్థులు ఎమ్మెల్సీని కోరారు.

80 గ్రాముల బంగారం మాయం

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఓ ఇంట్లో 80 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. ఎస్‌ఆర్‌నగర్‌లో ఉండే శ్రీనివాసులు 80 గ్రాముల బంగారు ఆభరణాలను కొనుగోలు చేసి ఇంట్లోని బీరువాలో దాచాడు. ఈ నెల 1వ తేదీన శ్రీనివాస్‌లు భార్య బీరువా తెరిచి చూడగా నగలు పెట్టిన బాక్సులు ఉన్నప్పటికి వాటిలో నగలు మాత్రం కనిపించలేదు. బీరువా తలుపులు వేసినట్టే ఉండి, తాళం చెవులు కూడా ఎప్పుడు పెట్టే చోటే ఉన్నాయి.అయినా నగలు కనిపించక పోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

అమీర్‌పేట: ప్రమోషన్‌ రావడం లేదన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ సంఘటన ఎస్‌ఆర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన ఆవుల మస్తాన్‌రావు (24) ఎస్‌ఆర్‌నగర్‌లోని శ్రీసాయి అంకిత్‌ హాస్టల్‌లో ఉంటూ కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ప్రమోషన్‌ కోసం చాలా ప్రయత్నించినా రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. జులై 31న హాస్టల్‌ గదిలో గుర్తు తెలియని విషం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆలస్యంగా రూమ్‌కు వచ్చిన స్నేహితులు అతడిని లేపేందుకు ప్రయత్నించినా లేవలేదు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

కత్తులతో సంచరిస్తున్న ఇద్దరి అరెస్టు

అమీర్‌పేట: బోనాల పండుగ ఉత్సవాల్లో భాగంగా ఫలహారపు బండి ఊరేగింపులో కత్తులతో తిరుగుతున్న ఇద్దరిని ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులు అరెస్టు చేశారు. బల్కంపేట ప్రశాంత్‌నగర్‌ కాలనీ సమీపంలో గురువారం బోనాల వేడుకలు నిర్వహించి రాత్రి ఫలహారపు బండి ఊరేగించారు.ఊరేగింపు ఎస్‌ఆర్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర దేవాలయం వద్దకు రాగా అక్కడి విధులు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఒక డ్యాగర్‌(కత్తి)ను స్వాధీనం చేసుకున్నారు.బేగంపేట మయూరి మార్గ్‌లో ఉండే భీమ్‌సింగ్‌ సురేష్‌, బీజేఆర్‌నగర్‌కు చెందిన రామేశ్వరమ్‌ రామ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌లోని వివిధ రైళ్లలో తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు శుక్రవారం 10 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. రైళ్లలో గంజాయి రవాణా అవుతుందన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించిన అధికారులకు కోణార్క్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు జనరల్‌ బోగీలో అనుమానాస్పదంగా కనిపించిన గేజీలను సోదా చేయగా అందులోంచి 10 కిలోల గంజాయి బయటపడిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టర్‌ కమల్‌హాసన్‌రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం రైల్వేస్టేషన్‌లోపల, పరిసర ప్రాంతాలతో పాటు పలు ప్రాంతాల్లో దాడులు జరిగాయని తెలిపారు. సంగారెడ్డి, మంచిర్యాలలో నాలుగు కేసులు నమోదు చేసి 540 కేజీల నల్లబెల్లం, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. రైల్వేస్టేషన్‌ తనిఖీల్లో ఎక్సైజ్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ అనిల్‌కుమార్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత నిరాశ, నిస్పృహలకు లోనుకావద్దు

రాంగోపాల్‌పేట్‌: యువత ఎలాంటి నిరాశ నిస్పృహలకు లోను కావద్దని ప్రపంచంలో అనేక అవకాశాలున్నాయని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్‌ నారాయణ్‌ అన్నారు. సికింద్రాబాద్‌లోని హరిహరకళాభవన్‌లో ఇంపాక్ట్‌ ఇంటర్నేషనల్‌ ఆధ్వర్యంలో రెండవ రోజు జరుగుతున్న వ్యక్తిత్వ వికాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పోరాట పటిమను అలవర్చుకుని తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించేంతవరకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో గంప నాగేశ్వరరావు, పట్టాభిరాం, జ్యోతిరెడ్డి, మల్లిఖార్జున్‌, మిమిక్రీ రమేష్‌, కశ్యప్‌, యము పాఠక్‌లు యువతకు మోటివేషనల్‌ సందేశాలను అందించారు.

వీసీలను నియమించాలి



ఓయూలో ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలకు వీసీలను నియమించాలని ఏబీవీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఓయూలో తరగతులు బహిష్కరించి ఆర్ట్స్‌ కాలేజీ వరకు ర్యాలీ చేపట్టి రోడ్డు పై బైఠాయించి రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వీసీలను నియమించి వర్సిటీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు.

విద్యుత్‌ సమస్యల పరిష్కారానికి చర్యలు



విద్యుత్‌ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ రవికుమార్‌

బన్సీలాల్‌పేట్‌: విద్యుత్‌ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌(ఎస్‌ఈ) రవికుమార్‌ పేర్కొన్నారు. శుక్రవారం బన్సీలాల్‌పేట్‌ స్వామి వివేకానంద సంఘంలో వినియోగదారులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్‌ సమస్యల పరిష్కారంతో పాటు సరఫరాలో ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను సకాలంలో పరిష్కరిస్తున్నామన్నారు. డీఈ శ్రీధర్‌, ఏడీఈ దుర్గాప్రసాద్‌, ఏఈ క్రిష్ణలతో పాటు స్థానిక ప్రజలు అనేక మంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం



బాస్కుల కొమురయ్య

లాలాపేట: మూడు దశాబ్దాల నుంచి మాదిగలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి దేశంలోని అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం అని సబ్బండ కులాల జాతీయ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బాస్కుల కొమురయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలోని ప్రొ జయశంకర్‌ స్టేడియం వద్ద సంఘం నాయకులు జి. నర్సింగరావు, బి. అబ్రహాం, భద్రయ్య, బాస్కుల కిరణ్‌కుమార్‌ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు రిజర్వేషన్‌ ఫలాను పొందదని ఎస్సీ సామాజిక వర్గంలోని వారికి వర్గీకరణతో మాదిగలు, మాదిగ ఉపకులాలకు విద్యా, ఉద్యోగాల్లో జనభాదామాషా ప్రకారం అవకాశాలు దక్కుతాయన్నారు. 30 ఏళ్ల పాటు అలుపెరుగని ఉద్యమం చేసిన ఎమ్మార్పిఎస్‌ అధ్యక్షులు మంద కృష్ణమాదిగకు, ఉద్యమకారులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. మాదిగల ఆకాంక్షలను గౌరవించి సుప్రీం కోర్టు తీర్పు వచ్చేలా పని చేసిన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు, న్యాయ మూర్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఉస్మానియా యూనివర్సిటీ: జాబ్‌ క్యాలెండర్‌ విడుదల చేయడం పట్ల ఓయూ విద్యార్థులు, నిరుద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శుక్రవారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్‌ ముఖ్యఅతిథిగా హాజరై సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మెడ శ్రీను, వినయ్‌, సాయిగౌడ్‌, సుమన్‌గౌడ్‌, సతీష్‌ యాదవ్‌, శేఖర్‌, గణేష్‌, భార్గవ్‌ తదితరులు పాల్గొన్నారు.

జెరియాట్రిక్‌ విభాగానికి నాలుగు పీజీ సీట్లు మంజూరు

గాంధీఆస్పత్రి: గాంధీ మెడికల్‌ కాలేజీ జెరియాట్రిక్‌ వైద్య విభాగానికి నాలుగు పీజీ సీట్లు మంజూరు చేస్తూ నేషనల్‌ మెడికల్‌ కౌన్సిల్‌ (ఎన్‌ఎంసీ) ఉత్తర్వులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల గాంధీ ఆసుపత్రిలో వయోవృద్ధులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి గాంధీ మెయిన్‌ బిల్డింగ్‌ గ్రౌండ్‌ ఫ్లోర్‌ లో ఈ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. గాంధీకి నాలుగు జెరియాట్రిక్‌ పీజీ సీట్లను కేటాయించడం పట్ల వైద్య వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

కోట నీలిమ తన వైఖరి మార్చుకోవాలి

- పలువురు నేతల అసంతృప్తి

సనత్‌నగర్‌: కాంగ్రెస్‌ పార్టీ సనత్‌నగర్‌ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ నియంత ధోరణితో పార్టీకి నష్టం చేకూరుతుందని సీనియర్‌ నేతలు సలీంఖాన్‌, నాగేందర్‌రాజులు విమర్శించారు. కోట నీలిమ వైఖరిని నిరసిస్తూ బేగంపేట ఓల్డ్‌ కస్టమ్స్‌బస్తీలో పలువురు నేతలు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి చర్చించారు. కాంగ్రెస్‌పార్టీ, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో కార్యకర్తలకు తగిన ప్రాధాన్యతనివ్వడం లేదని ఆరోపించారు. కార్యకర్తల పట్ల దురుసుగా మాట్లాడుతూ వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. తమ వద్దకు వచ్చే నాయకులందరికీ కార్పొరేషన్‌ చైర్మన్‌ పదవి ఇస్తాం..కార్పొరేటర్‌ సీటు ఇస్తాం అంటూ పవన్‌ఖేరాతో హామీలు ఇప్పిస్తూ మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. ఒక నియోజకవర్గం నుంచి ఎంతమందికి కార్పొరేటర్లు, చైర్మన్‌ పదవులు ఇస్తారో చెప్పాలన్నారు. ఏదైనా సమస్యపై ఆమె వద్దకు వెళ్లే ప్రయత్నం చేస్తే అక్కడ ఢిల్లీ వాళ్ల పెత్తనమే కనిపిస్తోందన్నారు. ఇన్‌చార్జి తన పద్ధతి మార్చుకోకుంటే నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ఠ మసకబారే ప్రమాదం ఉందన్నారు.